

# పని బారెడు.. జీతం మూరెడు

- మారని ఆర్థిక పరిస్థితి
- దిక్కుతోచని స్థితిలో పంచాయతీ కార్మికులు


మురికినీటి కాలువను శుభ్రపరుస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

వాంకిడి, ఫిబ్రవరి 13: గ్రామ పరిపాలనలో పంచాయతీ కార్మికులు ఎంతో కీలకం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు పల్లెల్లో ప్రజలకు అందు బాటులో ఉండి సేవలందిస్తారు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ పంచాయతీ కార్మికుల్లో మార్పు రావడం లేదు. ఎక్కడైనా దుర్గంధం వస్తే మొదట గుర్తుకు వచ్చేది కామాటిలే.. ఎక్కడైనా జంతువులు, పశువులు చనిపోతే వాటిని తొలగించడానికి కావల్సింది కామాటిలే.. అలాంటి సమయంలో గుర్తుకు వస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు జీతాల విషయం వచ్చే సరికి ప్రభుత్వానికి గాని ప్రజాప్రతినిధులకు, అధికారులకు కానీ గుర్తుకు రాకపోవడం విచారకరం. పంచాయతీ కార్మికులు వారం రోజులు లేకపోతే గ్రామా చెత్తాచెదారంతో దుర్గంధంగా తయారై ప్రజలు బయటికి వెళ్లలేని పరిస్థితులు ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానంగా పని చేస్తున్న పంచాయతీ కార్మికుల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలులేవు. నెలనెలా వేతనాలు రాక అప్పులు చేసి జీవనం సాగిస్తున్న పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదిస్తున్నారు. నెలకు రూ.9500 జీతంతో ఏళ్లుగా పంచా యతీల్లో పనిచేస్తున్నా.. ఉద్యోగభద్రత లేదని కొత్త ప్రభుత్వ మైనా తమను ఆదుకోవాలని కారోబార్లు, పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

**● హామీ ఇచ్చారు.. అమలు మరిచారు..**

ఆరు నెలల క్రితం పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టారు. ఉవ్వెత్తున సమ్మె కొనసాగడంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అప్పటి ప్రభుత్వం దశలవారీగా కార్మికసంఘాల నేతలు, కార్మికులతో చర్చలు జరిపి కొన్ని సమస్యలకు పరిష్కారం చూపింది. కార్మికుడు చనిపోయిన తర్వాత దహన సంస్కారాలకు రూ.10వేల నగదును పంచాయతీ నుంచి ఇవ్వాలని, రూ.5లక్షల బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. మరికొన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా.. అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

**● ఉద్యోగ భద్రత ఇంకెప్పుడో..**

జిల్లాలోని 15మండలాల పరిధిలోని 335గ్రామపంచాయతీల్లో 1103 మంది పని చేస్తున్నారు. వీరిలో కారోబార్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషి యన్లు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ బల్బులు అమర్చుటకు, మంచినీరు విడుదల చేయడానికి, ఇంటిపన్ను వసూలు చేయడానికి, గ్రామంలో ఊడ్చడం, మురికికాలువలు శుభ్రపర్చడం తదితర పనులను వీరే చేస్తారు. కానీ అందుకు సరిపడా వేతనం మాత్రం అందుకోవడం లేదు. గ్రామాల్లో పన్నులు, బిల్లులు వసూళ్ల ఆధారంగా నెలకు రూ.9500 వేతనంగా చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు కూడా నెలనెలా కాకుండా మూడు నెలలకు ఒకసారి అందిస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఎప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పిస్తుందన్న ఆశతోనే వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ భద్రత, కనీసవేతనాల కోసం ఏళ్లుగా ఉద్యమిస్తూనే ఉన్నారు. గ్రామాల్లో ప్రభుత్వపథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఏ అధికారి పర్యటనకు వచ్చినా, మరే చిన్న పనికైనా వీరు తప్పక ఉండాల్సిందే. ప్రభుత్వం ఇచ్చే వేతనాలు ఉపాధిహామీ కూలీలకంటే తక్కువగా ఉండడంతో పెరుగుతున్న నిత్యవసరధరలకు అనుగుణంగా కుటుంబ పోషణ ఎలాసాధ్యమవుతుందని కార్మికులు వాపోతున్నారు. ఆశా వర్కర్లకు, ఇతర శాఖల సిబ్బందికి వేతనాలు పెంచుతున్న ప్రభుత్వం తమ గురించి పట్టించుకోకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇరవై ఏళ్ల నుంచి పంచాయతీల్లో కార్మికులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించి వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

**పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలి..**

శంకర్, కార్మిక సంఘం మండల కోశాధికారి



20 ఏళ్లుగా విధుల్లో ఉన్నాం. వచ్చే వేతనం మాత్రం రూ.9500 దాటదు. జీతాలు కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడంలేదు. సమాన పనికి సమాన వేతనంతో నెలకు రూ.21వేలు చెల్లించాలి. నేటికాలంలో రోజువారి కూలీ చేస్తేనే సుమారు రూ.500నుంచి రూ.1000 వరకు ఇస్తున్నారు. మాకు ఆ పరిస్థితి లేదు. ఇబ్బందులను ఎవరికి చెప్పుకోలేకపోతున్నాము. కొత్త ప్రభుత్వమైనా స్పందించి వేతనాలు పెంచి, ఉద్యోగభద్రత కల్పించాలి.

## విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న తిర్యాణి సీఐ చిట్టిబాబు

తిర్యాణి, ఫిబ్రవరి 13: వ్యవసాయ పొలాల్లో పంటలకు రక్షణగా, అటవీ జంతువులను వేటాడేందుకు అడవిలో విద్యుత్‌తీగలు అమర్చితే కఠినచర్యలు తప్పవని రెబ్బెన సీఐ చిట్టిబాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన బుగ్గరామన్నగూడెం, కోలాంగూడ, మాణక్యాపూర్‌గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ప్రవీణ్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందడం కలిచివేసిందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. తిర్యాణి మండలంలో ఎవరైనా విద్యుత్‌తీగలు అమర్చితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం బుగ్గరమన్నగూడెంలో 50దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎస్సై రమేష్, సిబ్బంది ఉన్నారు.

**వాంకిడి:** విద్యుత్‌తీగ తగిలి మృతిచెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కు మంగళ వారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సైసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు సంతాపం ప్రకటించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా కఠినచర్యలు తప్పవన్నారు.

**కెరమెరి:** పంటపొలాల్లో, అటవీప్రాంతాల్లో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విజయ్ అన్నారు. ఇటీవల పాటగూడ, ధనోర గ్రామాల్లో రైతులు చనిపోయారన్నారు. వన్యప్రాణుల కోసం వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## ఉద్యోగులకు బదిలీలు సహజం


సీఈవో రత్నమాలను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ కృష్ణారావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13: ఉద్యోగస్తులకు బదిలీలు సహజమని జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో రత్నమాల బదిలీపై ఆదిలాబాద్ జిల్లాకువెళ్తున్న సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ జిల్లాలో ఆమెచేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ_స్తులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పుడు ప్రజలలో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

**● కలెక్టర్ హేమంత్ బోర్కడే**


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13: సంప్రదాయ చేతి వృత్తులు, హస్తకళాకారులను బలోపేతంచేసి వారికి ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హేమంత్‌బొర్కడే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి సామర్థ్యాన్ని మెరుగుపర్చి ఉత్పత్తి ఉత్పాదకతను పెంచేందుకు పథకం ద్వారా కృషి చేస్తామని తెలిపారు. పథకంలోచేరిన వారికి సర్టిఫికేట్, గుర్తింపు కార్డు, శిక్షణ, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకం, మార్కెటింగ్‌లో ప్రభుత్వ మద్దతు అందిస్తామన్నారు. 18 కులవృత్తులను ఈ పథకంలో చేర్చామని తెలిపారు. కుటుంబంలో 18సంవత్సరాలు నిండిన ఒకరు మాత్రమే అర్హులని, విద్యార్హతతో సంబంధం లేకుండా కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్‌కార్డు, మొబైల్‌నెంతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి 5నుంచి 7రోజుల ప్రాథమిక నైపుణ్యం, 15రోజుల అధునాతన నైపుణ్యశిక్షణ ఇస్తూ రోజుకు రూ.500 భృతి, శిక్షణ పూర్తైన తరువాత రూ.15వేల కిట్, ధ్రువీకరణపత్రం అందిస్తామన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికీ తెలిసేవిధంగా విస్తృత ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం రఘు, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్‌హుస్సేన్, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతీరాం, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హనుమంతరావు, వెనుకబడి తరగతులసంక్షేమశాఖ అధికారి రమాదేవి, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా సమన్వయకర్త రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీలు సహకరించాలి

వచ్చే పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా సాగేందుకు రాజకీయపార్టీలు సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం కలెక్ట రేట్‌లో రాజ కీయపార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుదిఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 4,55,437మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 2,26,991 పురుషులు, 2,28,46మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 14న చేపట్టే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ పరిశీలన ముగింపులో భాగంగా మాక్‌పోలింగ్ ఉంటుందన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సహాయక పోలింగ్ కేంద్రా లతో పాటు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలి: డీఈవో అశోక్


బహుమతి అందజేస్తున్న డీఈవో అశోక్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 13: ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలని డీఈవో అశోక్ అన్నారు. మంగళవారం డీఆర్సీ భవనంలో ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆంగ్ల భాషపై మంచి పట్టు పెచ్చుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఉపాధికి చక్కటి మార్గాలు లభిస్తాయన్నారు. ఎల్టా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం తులసీరాం, హదియా మాట్లాడుతూ ఆంగ్లభాషపై పట్టు పెంచేందుకు విద్యార్థులకు డ్రామా ద్వారా అవగాహన పరుస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో భిక్షపతి, ఎల్టా సంఘంసభ్యులు పాల్గొన్నారు.

## రోడు ప్రమాదంలో ఒకరి మృతి

జైనూర్, ఫిబ్రవరి 13: మండలంలోని చింతకర్ర గ్రామపంచాయతీ పరిధిలో గల తాడిగూడ గ్రామానికి చెందిన పంద్రా భీంరావు(35) మంగళవారం రాత్రి బూసిమెట్ట క్యాంప్ పరిసరప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మంగళవారం బూసిమెట్ట క్యాంప్ సమీపంలో ఆటోను కారు బలంగా ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న పంద్రా భీంరావు మృతిచెందగా మరో 8మందికి గాయాలు అయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## ఫోర్జరీ కేసు నమోదు

దహెగాం, ఫిబ్రవరి 13: దహెగాం మండలం బోర్లకుంట గ్రామానికి చెందిన సోనులే లక్ష్మణ్ పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసినందుకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. లక్ష్మణ్ ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకొని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులను కోరాడు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన అధికారులు పంచాయతీ కార్యదర్శి సౌమ్యకు సమాచారం అందించారు. ఆమె ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి తన సంతకాన్ని ఫోర్జరీ చేశాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## బావిలో లభించిన సెల్‌ఫోన్లు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 13: మండలంలోని కర్జవెల్లి గ్రామానికిచెందిన తుమ్మిడి హరీష్, కంబాల మహేష్ మృతిచెందిన బావివద్ద సోమవారం మంగళవారం కౌటాల సీఐ సాదిక్‌పాషా ఆధారాల కోసం పరిశీలించారు. మృత దేహాలు లభించిన వ్యవసాయబావిలోని నీటిని మొత్తం బయటకు తోడించారు. అందులో వారి ఇద్దరి సెల్‌ఫోన్లు లభించాయి. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పూర్తివివరాలు తెలిసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

## అదనంగా డ్రా చేసిన డబ్బులు జమ చేయాలి

బెజ్జూరు, ఫిబ్రవరి 13: గత ఏడాది ఏప్రిల్‌లో బెజ్జూరు గ్రామపంచాయతీ పరిధిలో మట్టిరోడ్లు వేయగా, ఆపనులకు రెండుసార్లు బిల్లులు మంజూరు కాగా వాటికి సంబంధించిన నిధులను వారంలోగా గ్రామపంచాయతీ అకౌంట్‌లో జమ చేయాలని డీఎల్‌పీవో సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయ తీలో మట్టిరోడ్లు వేసిన వారితో మట్లాడారు. వివిధ రోడ్ల నిర్మాణం కోసం రూ.5.56లక్షలు ఖర్చు కాగా వారంలోగా జమచేయాలని ఆదేశించారు. అదనంగా డ్రాచేసిన నిధులు జమ చేయనివారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఎంపీడీవో రమేష్‌రెడ్డి, కార్యదర్శి తుకారాం ఉన్నారు.

## సమ్మె నోటీసు అందజేత

కౌటాల, ఫిబ్రవరి 13: ఈనెల16న జరిగే దేశవ్యాప్తసమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు మంగళవారం ఎంపీడీవోకు సమ్మెనోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మోరేశ్వర్, నగేష్, ప్రకాష్, శంకర్, రాజారాం, పోశం, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్సు అధికారుల దాడులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 13: కాగజ్‌నగర్ చింతగూడలో మంగళవారం టాస్క్‌ఫోర్సు ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మట్కా ఆడుతున్న అబ్దుల్ మహ్మద్‌ని అదుపులోకి తీసుకొని, అతనివద్ద ఉన్న చిట్టీలు, రూ.4320నగదును స్వాధీనం చేసుకున్నారు.

## రెబ్బెన తహసీల్దార్‌గా జ్యోత్స్న

రెబ్బెన, ఫిబ్రవరి 13: రెబ్బెన మండలానికి తహసీల్దార్‌గా జ్యోత్స్నను మంగళవారం జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ షమీర్‌ను సిద్దిపేటకు బదిలీ చేశారు. అలాగే ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో శ్రీనివాస్‌ను మంచిర్యాల ఎంపీడీవో కార్యాలయానికి బదిలీచేశారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

పెంచికలపేట, ఫిబ్రవరి 13: మండలంలోని ఎల్కపల్లి, గుంట్లపేట, చెడ్వాయి గ్రామాల్లో ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి రాజుల నాయుడు తనిఖీచేశారు. ఈ సందర్భంగా గోదాంలలో ఎరువుల నిలువలు, ఈపీఓ ఎస్ఎస్ నిలువలతో సరిపోల్చారు. రైతుల ఆధార్ నమోదు చేయంకుడా ఎట్టిపరిస్థితుల్లో అమ్మకాలు జరపరాదని ఆదేశించారు. వారానికి పదిదుకాణాల చొప్పున వ్యవసాయాధి కారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు తనిఖీ నిర్వహించాలన్నారు. ఆయనవెంట ఏఈవో లావణ్య ఉన్నారు.

## కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 13: పట్టణంలోని బాలేశ్వర ఆలయంలో రథసప్తమి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు చందావర్ శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంగళవారం చండి సప్తశతి వహనం నిర్వహించారు. 14న కుంకుమార్చన, 15న సహస్ర పుష్పార్చన, 16న బాలేశ్వర స్వామిరథోత్సవం, 17నమహాపూర్ణాహుతితో నవరాత్రిఉత్సవాలు ముగించనున్నట్లు తెలిపారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**● జడ్పీటీసీ సంతోష్**

రెబ్బెన, ఫిబ్రవరి 13: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రెబ్బెన జడ్పీటీసీ సంతోష్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, నంబాల మాజీసర్పంచి సోమశేఖర్, కళాశాల క్రీడల ఇన్‌చార్జీ శ్రీనివాస్, గంగాధర్, అధ్యాపకబృంద సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ట్రాక్ సూట్ ప్రదానం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13: గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ ట్రాక్‌సూట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, జిల్లా స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, కార్యదర్శి శంకర్, కోశాధికారి లక్ష్మణ్, కృష్ణమూర్తి, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.






## ఉద్యోగులు సమ్మెలో పాల్గొనవద్దు: జీఎం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి ఉద్యోగులు పాల్గొనవద్దని జీఎం సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మెనోటీసులో పొందుపర్చిన డిమాండ్లు సింగరేణి పరిధిలో లేవని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులు గమనించిసమ్మెలో పాల్గొనకుండా సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**మందమర్రి టౌన్:** సమ్మెతో సింగరేణికి, కార్మికులకు ఎలాంటి సంబంధం లేదని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కోల్ ఇండియాకు సంబంధించిన డిమాండ్లతో ఇక్కడ సమ్మె చేయడం భావ్యం కాదన్నారు. కార్మికులు వాస్తవాలను గ్రహించి ఈ సమ్మెకు దూరంగా ఉండాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యానికి కేవలం 40రోజులు మాత్రమే ఉందని కార్మికులు వాస్తవాలను గ్రహించి సమ్మెకు దూరంగా ఉండాలని తెలిపారు.

### కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 13: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో పనిచేస్తున్న కార్మికులకు హెచ్‌ఆర్‌ఏపై బేసిక్9 శాతం చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఏఐటీయూసీ పిట్‌కార్యదర్శి మర్రి కుమారస్వామి హెచ్చరించారు. మంగళవారం గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలటీ పరిధిలో ఉన్న కేకే ఓసీలో పనిచేస్తున్న వారికి ఇంతవరకు బేసిక్‌పై 9శాతం చెల్లించలేదన్నారు. ఎన్నో నెలలుగా డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం పెడచెవిన పెడుతోందన్నారు. యాజమాన్యం సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

### అధిక ఉత్పత్తితోనే అభివృద్ధి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 13: అధిక ఉత్పత్తితోనే అభివృద్ధి సాధ్యమని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏరియాలోని కేకే1 డిస్పెన్సరీ, ఎస్‌అండ్‌పీసీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వారం రోజులుగా సమావేశాలు ఏర్పాటు చేసి సంస్థ స్థితిగతులను కార్మికులకు వివరిస్తున్నామన్నారు. ఉద్యోగులు, అధికారులు కలిసి పనిచేస్తే సంస్థ మరింత ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన పలువురు ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి పైడీశ్వర్, ఏజీఎం ఈఅండ్ఎం నాగరాజు, ఐఈడీ డీజీఎం రాజన్న పాల్గొన్నారు.

### 19న మెడికల్ చెకప్‌కు హాజరు కావాలి

మంచిర్యాల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గతంలో మెడికల్ అన్‌ఫిట్ అయి జనరల్ మజ్దూర్ కేటగిరీ తీసుకున్న మైనింగ్‌సిబ్బంది ఈనెల19న కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో నిర్వహించే మెడికల్ చెకప్‌కు హాజరుకావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ సిబ్బందికి పదేళ్లగా సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా ఇస్తున్నారని, ఈ విషయంలో తాము మాట్లాడడంతో మైనింగ్ సిబ్బందికి సర్ఫేస్‌లో కూడా సేమ్‌జాబ్ ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. దీంతో మైనింగ్ సిబ్బందికి మెడికల్ చెకప్‌కు తరలివెళ్లాలని ఆయన కోరారు.

### దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: కార్మిక సంఘాల జేఏసీ పక్షాన ఈనెల16న నిర్వహించే సమ్మెకు తాము పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, ప్రధానకార్యదర్శి బూపెల్లి బానయ్య, ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గనుల విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ పెంపు, సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ, ఆర్ఎంఎస్ మెడికల్‌కార్డుతో ఉచిత వైద్యసేవలు, తదితర డిమాండ్లను సమ్మెనోటీసులో చేర్చడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. యావత్తు పింఛన్‌దారులు మద్దతు ప్రకటించాలని కోరారు.

### సర్ఫేస్‌లో సేమ్ జాబ్‌పై నాయకుల హర్షం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: మైనింగ్‌సిబ్బంది అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో సేమ్‌జాబ్ ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని మైనింగ్‌స్టాఫ్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ నాయకులు వంగరి రాజేశ్వర్‌రావు, గోపతి సత్యనారాయణ, మారేపల్లిబాబు, విజయ్, బాలకృష్ణ, రాజేష్‌యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తూ అన్‌ఫిట్ అయిన వారికి జనరల్‌మజ్దూర్‌గా సర్ఫేస్‌లో అవకాశం కల్పించేవారన్నారు. ఈ అన్యాయాన్ని తాము నిరసించి పలుమార్లు జేఏసీ పక్షాన నిరాహారదీక్షలు, నిరసనలు, ఉద్యమాలు చేపట్టామన్నారు. దీంతో సింగరేణిసంస్థ మణుగూరు, ఆర్‌జీ-1, ఆర్‌జీ-3,భూపాలపల్లి, శ్రీరాంపూర్‌ఏరియాలకు చెందిన18 మంది మైనింగ్‌స్టాఫ్‌కు ఈనెల19న కొత్తగూడెంలోని ప్రధానఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేసేందుకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తమకు సహకరించిన సింగరేణి యాజమాన్యం, అధికారులు, యూనియన్ నాయకులు, మైనింగ్‌సిబ్బందికి వారు ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు.

## కంటి వైద్య శిబిరానికి స్పందన

భీమారం, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. మంచి ర్యాలకు చెందిన కంటి వైద్య నిపుణుడే అభిషేక్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 350కి కంటి పరీక్షలు చేయగా 60 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రేకుర్తిలోని కంటి ఆసుపత్రికి ఉచితంగా వాహనంలో గురువారం తరలించి ఆపరేషన్ చేయిస్తామని మంచిర్యాల లయన్స్‌క్లబ్ సభ్యుడు సుగుణాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రెడ్డి, బానేష్, రవితేజ, అజయ్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం

జైపూర్, ఫిబ్రవరి 13: మండలంలోని ఇందారం గ్రామంలో సోమవారం రసాయనాలు కలిసిన నీరు తాగి మృతిచెందిన మేకలకు మంగళవారం పశువైద్య సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించారు. రసాయనాలు కలిసిన నీరు తాగడం వల్లనే మేకలు మృతిచెందినట్లు సిబ్బంది నిర్ధారించారు. మృతిచెందిన మేకలతో పాటు అస్వస్తతకు గురైన వాటికి చికిత్స చేశారు. భారీ వాహనాలకు ఆయిల్ తయారీలో భాగంగా అనుమతులు లేకుండా ఈ రసాయనాల ప్లాంటు నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండా ప్లాంటు నిర్వహిస్తున్న విషయంపై కేసు నమోదుచేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ ప్లాంట్‌ను మూసివేయించామని ఎస్సై ఉపేందర్ చెప్పారు. బాధితులకు నష్టపరిహారం అందిస్తామని సంబంధిత ప్లాంటు యాజమాన్యం హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గడ్డం ప్రసాద్‌గౌడ్, ఫయాజ్, అరికె సంతోష్ పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

కాసిపేట, ఫిబ్రవరి 13: దేవాపూర్‌లో బుధవారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకుడు గొంది వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.. వివరాల కోసం 9391449510, 7780369494 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఏసీసీ, ఫిబ్రవరి 13: నస్పూర్ పట్టణానికి చెందిన వేల్పుల విజయ్ (18) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. నస్పూర్‌కు చెందిన విజయ్ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడన్నారు. ఈ నెల 2న మోటార్ సైకిల్‌పై మంచిర్యాలకు వచ్చి తిరిగి నస్పూర్‌కు వెళ్తుండగా చున్నంబట్టీవాడ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడన్నారు. మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఈ నెల 10న హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడచికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మంగళవా రం ఉదయం మృతిచెందాడని మృతుడి బంధువు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థులకు అవగాహన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: బెల్లంపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల్లో విజయం సాధించడంపై హైదరాబాద్ నుంచి వచ్చిన మోటివేటర్, ఉపన్యాసకులు మద్దివేని అర్జున్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని, ఎలాంటి ఒత్తిడి, ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని చెప్పారు. సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళిక ప్రకారం చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. పాజిటివ్ థింకింగ్ అలవర్చుకోవాలని, క్రమ శిక్షణ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, పాల్గొన్నారు.

## బంద్‌ను విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే బంద్‌ను విజయవం తం చేయాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని కాంటా చౌరస్తాలో 16న నిర్వహించే దేశ వ్యాప్త కార్మికుల సమ్మె- భారత్ బంద్ పో స్టర్లను మంగళవారం ఐక్య కార్మిక సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సంద ర్భంగా పలువరు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికరైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. ఈ నెల 16న జరిగే బంద్‌లో కార్మికులు, రైతులు, ప్రజలు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌పాషా, బీకేఎంయూజిల్లా ప్రధాన కార్యదర్శి గుండ మాణిక్యం, టీఎస్‌టీయూసీ, ఏఐటీయూసీ, రైతు కూలీ సంఘం నాయకులు మణిరాంసింగ్, రమణ, తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీవోఏల సమ్మె నోటీసు

నెన్నెల, ఫిబ్రవరి 13: రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఐకేపీ వీవోఏలు మద్దతు ప్రకటించారు. తాము కూడా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటామన్నారు. ఈ మేరకు సీసీ కమలాకర్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు తైదల సమ్మయ్య, గౌరవ అధ్యక్షులు దుర్గం మల్లేష్, సభ్యులు చుంచుల మల్లేశ్వరి, కోట శంకర్, ఇందారపు భాగ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహం ప్రతిష్ఠకు అనుమతి ఇవ్వాలి

ఏసీసీ, ఫిబ్రవరి 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ప్రతిష్ఠించేందుకు అనుమతి ఇవ్వాలని విగ్రహ సాధన సమితి సభ్యులు కర్ణకంటి రవీందర్, రామగిరి శ్రీనివాస్ అన్నారు. విశ్వనాథ ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడా రు. ఈ నెల 19న శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని హిందువుల చిరకాల వాంఛ అయిన శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు అధికా రులు సహకరించాలని కోరారు. మూడేళ్లుగా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, మణికంట, సందేష్, శ్రీకాంత్ , హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ లక్ష్యాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: జిల్లాలో రైసుమిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు మిల్లు సీజ్ చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపుకలెక్టర్ మోతిలాల్‌తో కలిసి మంగళవారం జిల్లాపౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, రైసుమిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైసు మిల్లర్ల సంఘం నాయకులు రైసు మిల్లుల యాజమానులను సమన్వయం చేసుకుంటూ కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని రైసుమిల్లులకు వాటి సామర్థ్యానికి అనుగుణంగా లక్ష్యాలు కేటాయించగా 73 శాతం పూర్తి చేశారని తెలిపారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో మిల్లులను సీజ్ చేస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## షాదీఖానా భూమి కబ్జా కాకుండా చర్యలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: పట్టణంలోని శంషీర్‌నగర్‌లో షాదీఖానాకు కేటాయించిన భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. మంగళవారం షాదీఖానా స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ షాదీఖానా స్థలం విషయంలో రెవెన్యూ సిబ్బందితో సర్వేచేయించి కబ్జా కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. షాదీఖానా స్థలం విషయంలో కొందరు కోర్టు నుంచి ఆర్డర్లు తీసుకువచ్చారని వాటిని సైతం పరిశీలిస్తారని చెప్పారు. అలాగే పట్టణంలో ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# అపురూపమైన అనుభూతి

- మదిలోని మాటలను చెప్పేదే ప్రేమ
- నేడు వాలెంటైన్స్ డే
- బహుమతులు కొనుగులు చేస్తున్న యువత

మంచిర్యాల కలెక్టరేట్/దండేపల్లి, ఫిబ్రవరి 13: ప్రేమలో పడితే ప్రేమే లోకం... మరో లోకం ఉండదు... ఒకరికి ఒకరు ఒకరి కోసం ఒకరు ఉండడమే లవ్.. ప్రేమ అనే రెండక్షరాలు రెండు గుండెల ప్రతిస్పందన... రెండు హృద యాల కలయిక.. మదిలోని భావాలను వ్యక్తి పరిచే రోజే ప్రేమికుల రోజు... నేడు వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన వాలెంటైన్స్ డే ఇప్పుడు పల్లెలకు విస్తరించింది. పెద్దలతో పోరాడి పెళ్లిళ్లు చేసుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకున్న ప్రేమికులు ఉన్నారు. వివాహ బంధంలో ఇమడలేక విడిపోయిన వారు ఉన్నారు. ప్రస్తుతం యువత తమ ప్రేమను వ్యక్త పరుచుకుంటూ వివాహ బంధంతో ఒక్కటవుతున్నారు. బుధవారం తమ ప్రేయసికి ప్రియులు బహుమతులు అందజేసేందుకు గిఫ్టుకార్డులు, ప్రత్యేక బహుమతులు కొనుగోలు చేస్తున్నారు.

### ● ప్రేమికుల రోజు వచ్చిందిలా..

క్రీస్తు శకం 270లో రోమ్‌లో వాలెంటైన్ అనే ప్రవక్త ఉండేవాడు. ప్రేమ వల్ల ప్రపంచం ఆహ్లాదక రంగా, ఆనందంగా మారుతుందని ఆయన అభిప్రాయం. అందుకే రహస్యంగా యువతీ యువకులకు ప్రేమోపదేశాలు చేసి ప్రేమ వివాహాలను ప్రోత్సహించడం ప్రారంభించాడు. వాలెంటైన్‌కి రోజు రోజుకు అభిమానులు పెరిగిపోతుండడంతో రోమ్ రాజు క్లాడియస్‌కు భయం ప ట్టుకుంది. దేశాన్ని కాపాడాల్సిన యువతకు ప్రేమ పాఠాలు నేర్పి బలహీనులుగా తయారు చేస్తున్నాడనే అభియోగంపై క్లాడియస్ వాలెంటైన్‌కు మరణ శిక్ష విధించాడు. వాలెంటైన్ అభిమానుల్లో క్లాడియస్ కుమార్తె కూడా ఉండడం విశేషం. ప్రేమకు మారు పేరుగా వాలెంటైన్‌ను ఫిబ్రవరి 14న ఉరి తీశారు. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు అప్పటి పోప్, గెలిసియస్ ఫిబ్రవరి 14ను


కన్నెపల్లిలో సదానందస్వామి ఆలయం

వాలెంటైన్స్ డేగా ప్రకటించారు. ఎక్కడో రోమ్‌లో అది దశాబ్దాల క్రితం జీవించిన ఓ క్రైస్తవ ప్రవక్త పేరుతో మొదలైన ఈ ప్రేమికుల రోజు ఇప్పుడు ప్రపంచ ప్రేమికుల దినోత్సవంగా మారిపోయింది.

### ● ప్రేమ పెళ్లిళ్లకు నిలయంగా..

జిల్లాలోని దండేపల్లి మండలం కన్నెపల్లిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సదా నందహరి స్వామి ఆలయం ప్రేమ పెళ్లిళ్లకు నిలయంగా మారింది. సదానుందుడి సాక్షిగా ఏటా ఇక్కడ ప్రేమ వివాహాలు జరుగుతుండడంతో ఈ ఆలయానికి కాస్తా ప్రేమాలయంగా పేరు వచ్చింది. కొన్నేళ్లుగా ఎందరో ప్రేమికులు ఇంటి పెద్దలు ఒప్పుకోకపోవడంతో వారి స్నేహితులతో కలిసి వచ్చి ఈ ఆలయంలో పెళ్లిల్లు చేసుకుంటున్నారు. ఈమధ్య కాలంలో ప్రేమించుకున్న వారు వారి కుటుంబ సభ్యుల ఒప్పించి ఈ ఆలయంలో పెళ్లి చేసుకుంటున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి

జన్నారం, ఫిబ్రవరి 13: కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం అటవీ రేంజ్ పుట్టిగూడ బీట్‌లో మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతిచెందింది. మంచిర్యాల ఆదిలాబాద్ నిర్మల్ వెళ్లే ప్రధాన రహదారి హనుమాన్ ఆలయం సమీపంలో గాయపడిన చుక్కల దుప్పిని స్థానికులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చుక్కల దుప్పిని మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వచ్చి డాక్టర్ శ్రీకాంత్‌తో ప్రథమచికిత్స చేయించారు. చుక్కల దుప్పికిమెడ దగ్గర తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందింది. అనంతరం చుక్కల దుప్పిని డీర్ పార్కు సమీపంలో పూడ్చి పెట్టినట్లు ఎఫ్‌బీవోలు రహీముద్దీన్, శ్రీనివాస్, బానయ్య తెలిపారు.

## ప్రతిభ చాటిన విద్యార్థులు

ఏసీసీ, ఫిబ్రవరి 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమానికి డీఈవో యాదయ్య అతిథిగా హాజరై విజేతలకు మెమోంటో, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే విద్యార్థులు ఏ భాషనైనా అవలీలగా నేర్చుకుంటారని తెలిపారు. భాష పట్ల భయం వీడి ధైర్యంగా ఇంగ్లీష్ మాట్లాడే ప్రయత్నం చేస్తే పట్టు సాధించవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యం చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశల్లో ప్రతి విషయాన్ని గమనించి అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు. ఈ పోటీల్లో స్పెల్ విజార్డ్‌లో వైష్ణవి మొదటి, సంజన ద్వితీయ, డ్రామా పోటీల్లో సాయివైష్ణవి గ్రూపు మొదటి, మణిసన గ్రూపు ద్వితీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఎల్‌టా సభ్యులు బాబీ, సత్తయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏసీపీగా రవికుమార్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: బెల్లంపల్లి ఏసీపీగా రవికుమార్‌ను నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహించిన ఆయన లోక్ సభ ఎన్నికల బదిలీల్లో భాగంగా బెల్లంపల్లి ఏసీపీగా వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఏసీపీ సదయ్యను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతామని తెలిపారు.

## బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మల్లారెడ్డి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మల్లారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో భాగంగా నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మల్లారెడ్డి బదిలీపై బెల్లంపల్లికి వచ్చారు. గతంలో ఇన్‌చార్జీ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఆర్ఐ భుజంగరావు ఆదే స్థానంలో విధులు నిర్వహించనున్నారు.

## దండేపల్లి ఎస్సైగా నరేష్ బాధ్యతల స్వీకరణ

దండేపల్లి, ఫిబ్రవరి 13 : దండేపల్లి ఎస్సై గా నరేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్య బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రసాద్ మంచిర్యాల టౌన్ కు బదిలీ పై వెళ్లారు కాగా కన్నెపల్లి మండలం నుంచి నరేష్ బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ఏ సమస్యలు వచ్చినా ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

## ఏఐఎస్‌బీ పట్టణ కమిటీ ఎన్నిక

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) పట్టణ కమిటీని మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా నాయకుడు సన్నిగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా జతిన్‌గౌడ్, కార్యదర్శిగా సిద్దార్థ, ఉపాధ్యక్షులుగా అరుణ్, సహాయకార్యదర్శిగా అఖిల్,కోశాధికారిగా నవీన్‌ను ఎన్నుకున్నారు.

## సెలవులు పెట్టి విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: రాష్ట్రప్రభుత్వ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురుకుల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రెండో రోజూ మంగళవారం బెల్లంపల్లి బాలుర, బాలికల గురుకులాల్లో ఉపాధ్యాయులు మూ కుమ్మడిగా సెలవులు పెట్టి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌లు సైదులు, సంతోష్, స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వానికి తమ సమస్య లు తెలియజెప్పడంతో భాగంగా సిబ్బంది సెలవులు పెట్టి మరీ విధులకు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులు చదువు నష్టపోకూడదని భావించి సెలవులు పెట్టి విదులు నిర్వహించామన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమకు మద్దతు తెలుపుతున్నారని వివరించారు. ప్రభుత్వం సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## ● సంక్షిప్తం..

● దండేపల్లి: దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి బలుగూరి నీలేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు దినకర్మ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సమకూర్చిన రూ. 10వేల ఆర్థిక సాయం కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు.

● హాజీపూర్: గుజరాత్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించే నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ (నిడ్జమ్) పోటీలకు గుడిపేటలోని మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని దీక్షిత అండర్- 16 విభాగంలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ ఆర్పీ తెలిపారు.

- బెంగుళూరులో ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా సౌత్ జోన్ నేషనల్ ఓపెన్ టాలెంట్ హంట్ పోటీ ల్లో గుడిపేటలోని మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఇంద్రవర్మ కాంస్య పతకం సాధించాడు.

● వేమనపల్లి: ప్రత్యేక పారిశుద్య కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు, దుకాణదారులకునీల్వాయి గ్రామ ప్రత్యేకాధికారి శ్రీపతి బాపురావు అవగాహన కల్పించారు.

● కాసిపేట: దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ నాలుగో ప్లాంటు విస్తరణలో భాగంగా మైన్స్ లీజుపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు కంపెనీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- కాసిపేట గనిపై సమ్మె పోస్టర్లను ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి మల్లేష్ ఆవిష్కరించారు.

● తాండూర్, దుకాణాల సముదాయాలు, హోటళ్ల యాజమానులకు ప్లాస్టిక్ వాడితే వల్ల జరిగే నష్టాలపై పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించారు.

● బెల్లంపల్లి: పట్టణంలోని శాంభవి విజన్ సెంటర్ ఆవ రణలో లయన్స్‌క్లబ్ ఆఫ్ సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

● మంచిర్యాల కలెక్టరేట్: హైదరాబాద్‌లో మాల భవన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాలమహానాడు ఆలిండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక శ్రీధర్ హైదరాబాద్‌లో మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

- తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం క్యాలెండర్లను జిల్లాపౌరసంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌరసంబంధాల అధికారి సంపత్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు.

● ఏసీసీ: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డైరీని మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, రామ్మోహన్, గోపాల్ తదితరులు ఆవిష్కరించారు.

● కోటపల్లి: మండలంలోని పారుపెల్లి ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం శ్రీసత్య సాయి ట్రస్టు ఫర్ యూనివర్శల్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వ ర్యంలో ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు స్వర్గీయ కృష్ణమూర్తి జ్ఞాపకార్థంగా ట్రస్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంచాల రామ్మూర్తి విద్యార్థులకు అందజేశారు.

- తెలంగాణ కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా మం డలంలోని పారుపెల్లికి చెందిన కారెంగుల సమ్మయ్యను నియమించినట్లు కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● మందమర్రిరూరల్: వెంకటాపూర్ గామంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనార్థాలపై ప్రజలకు గ్రామప్రత్యేకాధికారి, ఎంపీవో బీరయ్య అవగాహన కల్పించారు.

● ఏసీసీ: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళ వారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

## నేడు ఉచిత నేత్ర శస్త్రచికిత్స శిబిరం

కౌటాల, ఫిబ్రవరి 3: మండలకేంద్రంలోని జాన్వీ విజన్‌కేర్ ఆసుపత్రిలో కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాలకు చెందిన 50 మందికి ఉచితనేత్రపరీక్షలు నిర్వహిస్తామని జేఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ నారాయణ సర్కార్, సీమసర్కార్ తెలిపారు. ఆపరేషన్ అవసరం ఉన్న 26మందిని మంచిర్యాలకు పంపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అధికారులు వేధిస్తున్నారు: రేషన్ డీలరు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13: ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తనను వేధింపులకు గురిచేస్తున్నారని వాంకిడి మండలం కనర్‌గాం రేషన్‌షాపు డీలర్ రత్నం రేఖ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. రేషన్ దుకాణంలో బియ్యం నిలువలు సక్రమంగానే ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా తనిఖీల పేరిట తరచూ వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. వారిని విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్లవద్దు

దహెగాం, ఫిబ్రవరి 13: మేడారంలో జరిగే సమ్మక్క- సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ప్లాస్టిక్‌కవర్లు, బాటిళ్లు తీసుకెళ్లవద్దని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నర్సరీపనులు వేగవంతం చేయాలన్నారు. మేడారంలో ప్లాస్టిక్‌కవర్లు, బాటిళ్లు భక్తులు తీసుకెళకుండా, గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఈవో కల్పన పాల్గొన్నారు.

# భారత్‌బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 12: ఈనెల16న చేపట్టనున్న భారత్ బంద్ పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు మంగళవారం తీరందాజ్ కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి చాంద్ పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ బంద్ చేపడుతున్నట్టు తెలిపారు. అన్నిసంఘాలు మద్దతు ప్రకటించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పోశన్న, ప్రసాద్, తిరుపతి, మల్లేష్, భీంరావు, నరేష్, జానకి రాం, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.


భారత్ బంద్ పోస్టర్ల ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

### భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

రెబ్బెన: భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కార్మిక చట్టాలు దారుణంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులను కేంద్ర ప్రభుత్వం విస్మరించినట్టు తెలిపారు.

# ఉపాధ్యాయ సమస్యలపై పోరాటమే లక్ష్యం

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న అధ్యక్షుడు జంగయ్య

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయడమే టీఎస్‌యూటీఎఫ్ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎం గార్డెన్‌లో జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడీపీలో విద్యారంగానికి కొఠారి కమిషన్ నిర్దేశించిన మేరకు నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఆ పని చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించినప్పటకీ గత ప్రభుత్వంతో పోల్చితే వెయ్యికోట్లు అధికంగా కేటాయించడం కొంత సంతోషించదగ్గ విషయమే అన్నారు. ఉపాధ్యా యుల పదోన్నతులు, బదిలీలు లేక ఉద్యోగంపై విసిగిపోయారని అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో పదోన్నతులు కల్పించినప్పటికీ అరకొర మాత్రమేనని ఆరోపించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఇందు రావు, ఎల్లయ్య, హేమంత్, ఊశన్న, రమేష్, దుర్గయ్య, నిరంజన్, నారాయణ, తులసీరాం, శ్రీనివాస్, మహిపాల్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పీఎం జీవనజ్యోతి బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

● నాబార్డు అధికారి అంజన్న


అవగాహన కల్పిస్తున్న నాబార్డు అధికారి అంజన్న

సిర్పూర్(టి), ఫిబ్రవరి 13: రైతులు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమాకు దరఖాస్తు చేసుకోవాలని నాబార్డు అధికారి అంజన్న అన్నారు. మంగళవారం మండలంలోని పారిగాంలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, డిజిటల్ లావాదేవీలు, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సహకార మేనేజర్ జ్యోతి, సీఈవో రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ మండల కమిటీ

బెజ్జూరు, ఫిబ్రవరి 13: మండలకేంద్రంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ మండలకమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా దిగంబర్, తుకారాం, అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా దేవాజీ, కార్యదర్శిగా రాంప్రసాద్, కోశాధికారిగా తిరుపతి, సలహాదారులుగా జావీద్‌అలీ, ప్రచార కార్యదర్శిగా చిత్రుతోపాటు 20మంది కార్యవర్గ సభ్యులనుఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులుదేవాజీ, నారాయణ, నారాయణ, పోశన్న, వాసుదేవ్, రవి,రాకేష్,లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రేంప్రసాద్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం

కౌటాల, ఫిబ్రవరి 3: మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమోన్నత పాఠశాలలో మొగడ్‌దగడ్, సలుగుపల్లి, సోమిని స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాన్ని హెచ్ఎం నాందేవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎంవో ఉద్దవ్ పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి, లెర్న్ వర్డ్ ఏ డే (ఎల్‌ఏడబ్ల్యూడీ) ప్రోగ్రాంపై చర్చించారు. అలాగే మధ్యాహ్న బోజన వివరాలు, పాఠశాల మెయింట నెన్స్, ఇతరఅంశాలపై చర్చించారు. సమావేశంలో ఏటీడీవో ఖమర్‌హుస్సేన్, వామన్‌రావు, జీసీడీవో శకుంతల, ఎస్‌సీ ఆర్పీ వెంకటేశం, హెచ్ఎం భుజంగ్‌రావు పాల్గొన్నారు.

## అవకాశం ఇస్తే ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తా

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌పార్లమెంట్ స్థానంనుంచి కాంగ్రెస్‌అధిష్టానం అవకాశం ఇస్తే పోటీ చేస్తానని ఉట్నూరు మాజీ జడ్పీటీసీ సుగుణక్క అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బిడ్డలకు కాంగ్రెస్‌పార్టీఎప్పుడు అండగా ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు మట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామన్నారు.





మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పాల్గొన్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

## ఈ నేల త్యాగాల చరిత్ర.. 'బొగ్గు రవ్వలు'

● పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకావిష్కరణలో ప్రొ.హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'గురిజాల రవీందర్ సింగరేణి ఉద్యమ అనుభవాలు 'బొగ్గు రవ్వలు' చదువుతుంటే ఉద్వేగ పూరిత అనుభవాన్ని కలిగిస్తోంది' అని పలువురు వక్తలు ప్రశంసించారు. 'సింగరేణి బొగ్గు గనుల్లోని ప్రతి పెల్లకు అమరుల రక్తం అంటుకుంది' అంటూ రచయిత రాసిన వాక్యాలు హృదయాన్ని కదిలిస్తాయంటూ వక్తలు కొనియాడారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఇటీవల బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'బొగ్గు రవ్వలు' పుస్తకాన్ని ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషిని ఉన్నతీకరించే సాంస్కృతిక పరమైన మార్పు కోసం ప్రగతిశీల సమూహాలు శక్తమంతంగా ఉద్యమించాలని ఆకాంక్షించారు.

ప్రధాన వక్తగా హాజరైన 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వేష రాజకీయాలు నడుస్తోన్న ప్రస్తుత కాలంలో ఈ నేల త్యాగాల చరిత్రను గుర్తుచేసేందుకు 'బొగ్గు రవ్వలు' తోడ్పడుతుందన్నారు. స్వార్థరాహిత్యంతో ప్రపంచాన్ని మార్చడం కోసం తపనపడే వ్యక్తులు ఈ పుస్తకంలో తారసపడతారని తెలిపారు. తెలుగు ప్రాంతాల్లోని ప్రజావిప్లవ రాజకీయాల చరిత్ర రికార్డు కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రవీందర్, ఆ పోరాట అనుభవాలనూ రాయాల్సిందిగా కె. శ్రీనివాస్ కోరారు. ప్రజా ఉద్యమాల చరిత్రను పదే పదే ప్రజలకు గుర్తుచేయడం కోసం ఇలాంటి పుస్తకాలు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఉద్యమకారులకు కరదీపకగా అభివర్ణించారు. ఎన్‌కౌంటర్లు, అక్రమ నిర్బంధాలు వంటి వాటికి వెరవకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తోన్న అసలైన దేశభక్తులు ఈ పుస్తకం ద్వారా పరిచయం అవుతారన్నారు. పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ కర్త రామకృష్ణారావు మాట్లాడారు. హెచ్ రవీందర్ పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ చమన్‌సింగ్ సభాధ్యక్షత వహించగా, విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య, జర్నలిస్టు రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల్లో నెన్నెల జట్టు విజయం

నెన్నెల, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుప్పాల రఘు పటేల్ మెమోరియల్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో నెన్నెల జట్టు విజేతగానిలిచింది. 15 రోజుల పాటు కొనసాగిన టోర్నమెంట్‌లో 42 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో నెన్నెల జట్టు కన్నెపల్లి జట్టును 4 వికెట్ల తేడాతో ఓడించి చాపియన్‌షిప్ దక్కించుకుంది. విజేతలకు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్, ఎస్సై శ్యామ్‌పటేల్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విన్నర్ టీమ్‌కు 15 వేలు, రన్నర్ టీమ్‌కు 7,500ల నగదుతో పాటు కప్పులు, పతకాలు అందజేశారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన యువతను అభినందించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ ఇబ్రాహీం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సాగర్‌గౌడ్, ఎంఆర్‌ఐ గణేష్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు అశోక్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ నిర్వాహకులు గాజు ప్రవీణ్, ఓ. మహేష్, సర్వర్‌పాష, రాకేష్, సతీష్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## అయోధ్యకు తరలివెళ్లిన భక్తులు

ఏసీసీ, ఫిబ్రవరి 13: మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి సోమవారం రాత్రి ప్రత్యేక రైలులో రామభక్తులు పెద్ద సంఖ్యలో అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. ముందుగా మంచిర్యాల పట్టణంలో బీజేపీ నాయకులు, రామభక్తులు జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా నుంచి ముఖరాం చౌరస్తా మీదుగా రైల్వేస్టేషన్ వరకు ర్యాలీగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బీజేపీ రాష్ట్రకార్యదర్శి ప్రదీప్‌కుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి , రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జీ కందుల సంధ్యారాణి, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, రఘునాథ్ జెండా ఊపి రైలును ప్రారంభించారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలును ఏర్పాటు చేసి రాముడి దర్శనం కల్పించనున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా కిషన్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు అధికారిగా కిషన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్‌లోని కలెక్టరేట్‌కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

## జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమబాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు 8 మంది సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. దుర్గం చరణ్ తేజ్ 85.4, తీగల అక్షిత్ 83.64, దుర్గం అభిరనందన్ 75.50, లింగపల్లి అంజి 63.39, శివసాయి 58.17, విష్ణు చైతన్య 55.16, పుట్టల శివ 54.92, దిలీప్ 50.11 శాతం సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సీవోఈ సూపరింటెండెంట్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, అధ్యాపకులు శ్రీరామవర్మ, రమేశ్, లక్ష్మీనారాయణ, రవీందర్, శోభ, సమేదర్, తేజశ్వి, రాజశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

# 4 రోజులు ఘట్టాలు

భక్తజనం వనమంతా నిండి కుంభమేళాను తలపించే వనదేవతల జాతరకు వేళ అయింది. నాలుగు రోజుల పాటు 4 ఘట్టాలుగా వేడు కలు నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి.



- శరవేగంగా సమ్మక్క జాతర పనులు
- రూ. 75 లక్షలతో ఘనంగా ఏర్పాట్లు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- 21 నుంచి ప్రారంభం కానున్న వేడుకలు
- ఆచారాలనూ పాటించాలంటున్న భక్తులు
- గోదావరిలో నీరులేక ఇబ్బందులకు అవకాశం

మంచిర్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క- సారలమ్మ జాతర పనులు జిల్లాలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 21న సాయంత్రం 6 గంటలకు సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజు గద్దెలపైకి చేరుతారు. 22న సాయంత్రం 6 గంటలకు సమ్మక్క రానున్నా రు. 23న అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. 24న దేవతలు వన ప్రవేశం చేయనున్నారు.

**● దేవాదాయశాఖ ఆధ్వర్యంలో..**

సమ్మక్క- సారలమ్మ జాతరను జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జాతర నిర్వహిస్తుండగా, మిగతా ప్రాంతాల్లో కమిటీలు వేసుకొని జాతరను నిర్వహిస్తారు. సింగరేణి ప్రాంతాలైన శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో సంస్థ ఆధ్వర్యంలో జా తర ఏటా నిర్వహిస్తున్నారు. మంచిర్యాలలో నిర్వహించే జాతరకు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు భావిస్తున్నారు. మంచిర్యాల వద్ద జాతర సమయంలో జిల్లా నుంచేగాక చుట్టు పక్కల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరవు తుంటారు. దూర ప్రాంతాలకు చెందిన ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల పాటుగోదావరినది పరిసరాల్లో బస చేస్తుంటారు.

**● అడుగంటిన గోదావరి..**

గోదావరి నది ప్రసుత్తం అడుగంటింది. కాళేశ్వర్వం ప్రాజెక్టుల సముదాయం కుంగిపోవడంతో అప్పటిదాకా స్టోర్ చేసిన నీటినంతా దిగువకు వదిలిపెట్టారు. దీంతో గోదావరి నీరులేక వెలవెలబోతోంది. సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు మొదట గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవార్ల దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం గోదావరిలో నీరులేని కారణంగా భక్తులకు కొంతమేర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఎగువన ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి వెళ్లిన దృష్ట్యా జాతర సమయంలో గోదావరిలోకి నీరు విడిచే పరిస్థితి లేదు. ప్రతిసారి జాతర సమయంలో ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి నీరు విడుదల చేస్తుండగా, భక్తుల స్నానాలకు ఇబ్బందులు ఏర్పడేవికావు. అయితే ప్రత్యామ్నాయంగా నది ఒడ్డున పుష్కరఘాట్ల వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్నానఘట్టాలకు మరమ్మ తులు చేస్తున్నారు. కుళాయిలు బిగించడం ద్వారా భక్తులు స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపడుతున్నారు.

**● తాగునీటి సమస్య తలెత్తకుండా..**

జాతర సమయంలో తాగునీటి సమస్య భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. జాతరకు వెళ్లే రహదారికి ఇరువైపులా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కుళాయిలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ శుద్ధ జలం లభించక ఇబ్బందులు తలెత్తేవి. గోదావరి నీటిని నేరుగా సమీపంలోని ట్యాంకులోకి ఎక్కించి, అక్కడి నుంచి కుళాయిలకు విడుదల చేసేవారు. నీరు శుద్ధి చేయకపోవడంతో భక్తులు మినరల్ వాటర్ కొనుగోలు చేసేవారు. ఈ సంవత్సరం జాతరలో మంచినీటి సమస్య ఏర్పడకుండా పూర్తిగా శుద్ధ జలం అందించేందుకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చొరవతో ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గోదావరి రోడ్డులోని ప్రభుత్వ కళాశాల సమీపంలోగల ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నేరుగా జాతర స్థలి వద్దకు ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ పైపులైన్ ద్వారా కుళాయిల్లోకి శుద్ధ జలం సరఫరా చేయనున్నారు. తద్వారా మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు.



నీరులేక బోసిపోతున్న గోదావరి నది

**● వేగం పుంజుకున్న పనులు..**

సమ్మక్క- సారలమ్మ జాతర సమీపిస్తుండటంతో పనుల్లో వేగం పుంజుకుంది. జిల్లా కేంద్రంలో జరిగే జాతర పనుల కోసం పంచాయతీ రాజ్ శాఖ రూ. 75 లక్షలు వెచ్చించింది. గోదావరి నది ఒడ్డున ఉన్న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్న, నాగులమ్మ, గోవిందరాజు ల గద్దెలకు రంగులు వేస్తున్నారు. లైటింగ్ కోసం విద్యుత్‌శాఖ ఆధ్వ ర్యంలో నదితోపాటు పరిసరాలలో స్తంభాలు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తుల బసతోపాటు వాహనాల పార్కింగ్, దుకాణ సముదాయాల కోసం స్థానిక మాతా శిశు సంరక్షణ కేంద్రం సమీపంలోని భూములను చదును చేస్తున్నారు. గోదావరి పుష్కరఘాట్ సమీపంలో టాయ్‌లెట్లు, స్త్రీలు బట్టలు మార్చుకొనే గదుల నిర్మాణం చేపడుతున్నారు.

**భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు..**

**- రవికుమార్, ఎండోమెంట్ ఈవో**

మంచిర్యాలలో నిర్వహించే జాతరకు భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్ర భుత్వ శాఖల సమన్వయంతో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటు న్నాం. ఎమ్మెల్యే చొరవతో బట్టలు మార్చుకునే గదులు శాశ్వత పద్ధతిన నిర్మిస్తున్నాం. అమ్మవార్ల గద్దెల చుట్టూ సిమెంట్‌తో చదును చేస్తున్నాం. చుట్టూ మట్టి ఉండడంతో బెల్లం, కొబ్బరి ముక్కలతో పరిసరాలు అపరి శుభ్రంగా మారకుండా చర్యలు తీసుకుంటున్నాం.

## పిల్లలకు పోషకాహారం అందజేయాలి

**- అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్**



దుబ్బపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో చదివిస్తున్న కలెక్టర్

జైపూర్, ఫిబ్రవరి 13: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పోషకాహారం అందజేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని జైపూర్ 1, దుబ్బపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా స్త్రీ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ అధికారి చిన్నయ్యతో కలిసి తనిఖీ చేశారు. రిజిస్ట్రర్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పిల్లల హాజరును క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పోషకాహారం పంపిణీ చేయాలని చెప్పారు. పిల్లల ఎదుగుదల ఎత్తు బరువులను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్స్ యాక్టివిటీస్‌లో పిల్లలు ఆట పాటలతో కూడిన విద్యను నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. అంగన్‌వాడీకేంద్రాల్లో పంపిణీ చేసే కోడిగుడ్లు నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకోవాలని తెలిపారు. ఇది అంగన్‌వాడీ టీచర్ల బాధ్యత అన్నారు. పాలు, పప్పు, కూరగాయలతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి రోజు మధ్యాహ్నం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణుల వివరాలు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు చేసుకునేలా అవగాహనకల్పించాలని టీచర్లకు సూచించారు. ప్రసవం తర్వాత బాలింతలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, ఆహార నియమాలను తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహ సీల్దార్ రమేశ్‌బాబు, అదనపు చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి హేమసత్య, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క, సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 13: పాలవాగు ఒడ్డున ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యం లో నిర్వహించే సమ్మక్క సారక్క జాతరకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయని జీఎం మనోహర్ తెలిపారు. మంగళ వారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. 15వ తేదీన జాతర వద్ద దుకాణ సముదాయాల వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'డీఈవోను సస్పెండ్ చేయాలి'

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చేయూతనిస్తున్న మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకుని, సస్పెండ్ చేయాలని కోరుతూ టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీలు మంగళవారం ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతి పత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ గద్దెరాగడి సమీపంలోని గ్రీన్ ఫుడ్ కార్పొరేట్ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని డీఈవో దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లోని కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా హాజరు పట్టికలో సంతకాలు చేసుకుని జిల్లా కేంద్రంలో ఉంటున్నారని చెప్పారు. కొందరు రియల్ ఎస్టేట్, చిట్టీల వ్యాపారం చేస్తున్నారని అయినా డీఈవో పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఆలోచించాలని కోరారు. వెంటనే డీఈవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్మికులకు వేతనాలు పెంచాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు**

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు శుక్రవారం నిర్వహించే దేశ వ్యాప్త సమ్మె- బంద్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం నెలకు రూ. 26 వేలు చెల్లించాలని, మె డికల్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయమల్లు, మధు, నర్సయ్య, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

**నస్పూర్:** దేశవ్యాప్తంగా శుక్రవారం చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. నస్పూర్‌లోని ఎంఎ ల్‌ఎస్ పాయింట్, సీసీసీ కార్నర్‌లోని హమాలి యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 2021లో తెచ్చిన 5కనీస వేతన జీవోలను గెజిట్ లోకి తెచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో హమాలి యూనియన్ నాయకులు సత్యనారాయణ, సంపత్, చంద్రయ్య, మహేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిశీలన

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని అందుగులపేట గ్రామంలో మంగళవారం గృహ జ్యోతిలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులను విద్యుత్ అధికారులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దరఖాస్తుల్లో తప్పులు దొర్లితే సవరించారు. ప్రజలు తమకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ కడారి జీవన్‌కుమార్, లైన్‌మెన్ కొమురయ్య, ఎఎల్‌ఎం సంజీవ్, జేఎల్‌ఎం యాదయ్య, కారోబార్ మధుకర్, ఎలక్ట్రీషియన్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు**

**- డీపీవో వెంకటేశ్వర్‌రావు**



మేదరిపేటలో వ్యాపారులకు సూచనలు చేస్తున్న డీపీవో

దండేపల్లి, ఫిబ్రవరి 13: ప్రజలు, దుకాణదారులు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళ వారం మేదరిపేటలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం లో భాగంగా గ్రామ పంచాయతీని సందర్శించి పలు సూచనలు చేసారు. అనంతరం దుకాణదారులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. వారి వద్ద నుంచి నిషేధిత ప్లాస్టిక్ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, సిబ్బంది సతీష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

**హాజీపూర్:** పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గుడిపేట గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీల్లో పూడికతీ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రజలకు, కిరాణ దుకాణాల యాజమానులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని చెప్పారు. రోడ్లు, మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలందరు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని చెత్తబుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.